క్లుప్తంగా

ఆర్ట్ శ్రీనివాసులుకు సన్మానం



నంది అవార్డు గ్రహీత ఆర్ట్ శ్రీనివాసులును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నందికొట్కూరు: జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ నిర్వహించిన చిత్రలేఖన ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిత్రానికి నంది అవార్డును దక్కించుకున్న ఆర్ట్ శ్రీనివాసులుకు గవర్నమెంట్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు అల్వాల రామ్మూర్తి, సత్యం, నరసింహారెడ్డి, కట్టమంచి జనార్దన్‌రెడ్డి, శివరాముడు, వెంకట్రావు, రమణయ్య సోమవారం ఘనంగా సన్మానించారు. వల్లూరి ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు నెల 3న లలితా కళల గురించి చిత్రం గీసి పంపింపగా నంది అవార్డుకు ఎంపికైంది. సెప్టెంబర్ 17న హైదరాబాద్ రవీంద్రభారతిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చేవరకూ పోరాటం

జూపాడుబంగ్లా: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకూ పోరాడతామని రజక సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్, మాజీ రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి తెలిపా రు. సోమవారం మండలంలోని తంగడంచ గ్రామశివాలయం వద్ద రజకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 18 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులను కేంద్ర ప్రభుత్వం ఎస్సీజాబితాలో చేర్పించ న్నారు. తెలుగు రాష్ట్రాల్లోని రజకులను ఎస్సీజాబితాలో చేర్చకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం తంగడంచ గ్రామ రజక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పెద్దగోకారమయ్య, అధ్యక్షుడిగా నాగన్న, ఉపాధ్యక్షుడిగా చిన్నగోకారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శి మధు, కోశాధికారి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులులను ఎన్నుకున్నారు.

మా గ్రామం కోసం మేము



రోడ్డుపై గుంత పూడ్చుతున్న మాజీ సర్పంచు బాలునాయక్

పాములపాడు: మా గ్రామం కోసం మేము సైతం అంటూ శ్రమదానంలో పలు గ్రామాల్లో ప్రజలు విరివిగా పాల్గొన్నారు. మండలంలోని బానుముక్కల గ్రామంలో మాజీ సర్పంచు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు బాలునాయక్ సొంత ఖర్చులతో సోమవారం రోడ్డు పై గుంతలు పూడ్చి శ్రమదానం చేశారు. గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పలు చోట్ల గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. గాంధీ జయంతిని పురస్కరించుకొని బీటీ రోడ్డు పై ఏర్పడిన గుంతలో సిమెంటు, ఇసుక, కంకర కలిపి గుంతలు పూడ్చి వేశారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

మిడుతూరు : మండలంలో మంగళవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీఎన్ఎస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చింతలపల్లి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ క్యాంపుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు వసతులు కల్పించాలని ఆయన అధికారులు, వలంటీర్లకు సూచించారు.

నాటుసారా పట్టివేత

మిడుతూరు : మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో 10 లీటర్ల నాటు సారాను పట్టుకున్నట్లు ఎస్.ఐ జగన్‌మోహన్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చింతల పల్లి గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో పోలీసులు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. గడివేముల మండలం వైకేతండాకు చెందిన బిలావత్‌నానుకే నాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 10 లీటర్ల నాటుసారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ తెలిపారు.

ఆటో, బైక్ ఢీ.. ఐదుగురికి గాయాలు

పాములపాడు: మండలంలోని కృష్ణారావుపేట గ్రామ సమీపంలో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై సోమవారం ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు ఆటోలో చికిత్స నిమిత్తం కర్నూలుకు వెళ్లి వస్తుండగా మండలంలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన నాగన్న పొలం నుంచి బైక్‌పై వస్తూ ఢీకొనగా ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలు కాగా రైతు నాగన్నకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. గాయాలైన వారికి ప్రథమ చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు.

మహాత్ముడి ఆశయాలు సాధిద్దాం

- వాడవాడలా గాంధీ జయంతి
- జాతిపితకు ఘనంగా నివాళి



నందికొట్కూరులో గాంధీ దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కమిషనర్ కిషోర్, హౌసింగ్ పీడీ



ఆత్మకూరులో మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న శ్రీశైలం దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు

నందికొట్కూరు: మహాత్మాగాంధీ ఆశయ సాధన కోసం అందరం కలిసి ముందుకు సాగాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గాంధీ దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, కమిటీ సభ్యులు నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయక దేవాలయ ఆవరణలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. బ్రహ్మర్షి పితమహా సంస్థ జీవహింస చేయరాదని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ టీపీఓ బాలమద్దయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు రామ్మూర్తి, సుబ్రమణ్యం, నాగేశ్వరరావు, బచ్చు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మురళీ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శోభారాణి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిజినవేముల గ్రామ సచివాలయంలో సర్పంచ్ రవియాదవ్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తపల్లి: గువ్వలకుంట్లలో పంచాయతీ కార్యదర్శి చాందిని, వీఆర్వో శేఖర్, సచివాలయ సిబ్బందితో కలసి జాతిపిత చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా కొత్తపల్లి మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి సర్పంచు లక్ష్మీదేవి, సీపీఐ మండల కార్యదర్శి వెంకట శివుడు, ప్రజలతో కలసి పాలాభిషేకం చేశారు.

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ సచివాలయంలో సర్పంచు వరప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్లను దుశ్శాలువా, పూల మాలతో సత్కరించారు.

గాంధీ మార్గం అనుసరణీయం

జూపాడుబంగ్లా: జాతిపిత గాంధీ మహాత్ముని మార్గం అనుసరణీయమని తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచులు నాగార్జునరెడ్డి, బాలమద్దిలేటి, మాధవరం ప్రకాశం, పీఎం నాగిరెడ్డి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో, పి.లింగాపురం, తూడిచెర్ల, పారుమంచాల, తర్తూరు గ్రామాల్లోని సచివాలయాల్లో గంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

గాంధీ మార్గం ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకం

శ్రీశైలంటెంపుల్: గాంధీ మార్గం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అన్నారు. సోమవారం దేవస్థాన పరిపాలన భవనంలో గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

వెలుగోడు: స్థానిక గాంధీనగర్‌లోని మహాత్ముని విగ్రహానికి ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, నవనిర్మాణ కమిటీ నాయకులు, ఎస్‌డీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమాల్లో రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గాంధీజయంతి వేడుకలు

మిడుతూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో జీఎన్ఎస్‌రెడ్డి కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహానంది: బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవ గుప్త, సర్పంచ్ సిరిమాను సంధ్య, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియా మారూఫ్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, సయ్యద్ మీర్‌లు మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.



శ్రీశైలంప్రాజెక్టు జెన్‌కో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు

- శ్రీశైలంప్రాజెక్ట్: జాతిపిత మహాత్మగాంధీకి సోమవారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో ఘన నివాళులర్పించారు. ఏపీ జెన్‌కో కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్ కె.సుధీర్‌బాబు, ఇంజినీర్లు, సిబ్బంది, ఐటీడీఏ కార్యాలయంలో పీఓ రవీంద్రారెడ్డి, ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, ఈఈ కె.వి.ఎస్.ఎన్.కుమార్, మేనేజర్ శేషగిరిరావు, వాసవీ పరమేశ్వరి ఆలయ ప్రాంగణలో ఆవోపా నాయకులు కొత్త.వెంకటేశ్వర రావు, చల్లాకిశోర్, మర్చంట్స్ అసోషియేషన్ కారాయలయంలో డి.వి.నారాయణ, వ్యాపారులు మహాత్మునికి నివాళులర్పించారు.



పగిద్యాలలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

- గాంధీజీ.. పూజనీయుడు

పగిద్యాల: అహింసనే ఆయుధంగా ధరించి దేశానికి స్వాతంత్య్రాన్ని సాధించి పెట్టిన జాతిపిత మహాత్మ గాంధీ పూజనీయుడని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. అన్ని గ్రామ సచివాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనుల కోసం తీర్మానాలు చేశారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నందికొట్కూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు



నందికొట్కూరులో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి



కొత్తపల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాలవేస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవి



తుమ్మలూరులో గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం



జూపాడుబంగ్లాలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సుర్ణమ్మ, ఎంపీడీఓ నూర్జహాన్



వెలుగోడులో మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ లాలం రమేష్

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: స్వయంభువుగా కొలువై మహిమాన్వితుడిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని కనులపండుగగా చేపట్టారు.

ఓంకారేశ్వరుడికి పంచామృతాభిషేకం

ఓంకారం క్షేత్రంలో కొలువైన శ్రీ గంగ, ఉమాసమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రపాణిశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, పుష్పార్చన పూజలను వైభవంగా చేశారు.

నేడు సీహెచ్‌సీ ప్రారంభోత్సవం

వెలుగోడు: పట్టణంలో నూతనంగా నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైద్య విద్యాశాఖ మంత్రి విడుదల రజని, ఆర్థికశాఖ మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిలు ప్రారంభించనున్నారన్నారు. కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గాజులపల్లెలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

మహానంది: గాజులపల్లె గ్రామంలోని రెండో సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివ నాగజ్యోతి సోమవారం తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సర్వే పూర్తి చేశారన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు హాజరై వైద్య సేవలు అందిస్తారన్నారు.

పగిద్యాలలో..

పగిద్యాల: మండల పరిధిలోని పడమర ప్రాతకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. పడమర ప్రాతకోట గ్రామ పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరానికి స్పెషలిస్టు వైద్యులు హాజరై రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామంలోని 1600 కుటుంబాలకు సర్వే నిర్వహించి టోకన్‌లు పంపిణీ చేశారని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మిడుతూరు: మండలపరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 60,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి నిర్వహించి మండల కేంద్రానికి చెందిన తువ్వా రామనాగేశ్వరరెడ్డి, ఉప్పలదడియ గ్రామానికి చెందిన కమతం వీరారెడ్డి, షేక్ ఖాజా హుసేన్, కలమందలపాడు గ్రామానికి చెందిన అహమ్మద్ బాషా, తిమ్మాపురం గ్రామానికి చెందిన నడిపి నాగన్న, కొణిదేల గ్రామానికి చెందిన కన్నయ్య గారి రమేష్ నందన రెడ్డిలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

చేనేత వస్త్రాలనే ధరిద్దాం

శ్రీశైలం: చేనేత వస్త్రాలు ధరిద్దామని శ్రీశైల మండల బీజేపీ నాయకుడు అరవింద్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గాంధీజయంతిని పురస్కరించుకొని స్థానిక సిద్ధరామప్ప కాంప్లెక్స్‌లోని ఆప్కో వస్త్ర దుకాణంలో వస్త్రాలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ మోర్చ నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా 'లియాఫి' వ్యవస్థాపక దినోత్సవం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫి) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం లియాఫి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మహబూబ్ బాషా, కలిముల్లా, పుల్లయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైడ్ ఇవ్వలేదని ఘర్షణ

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలో పొలాలకు వెళ్లే దారిలో ఎద్దులబండి, ట్రాక్టర్ వెళ్తుండగా ఒకరికి ఒకరు దారి ఇచ్చుకునే విషయమై మాటా మాట పెరిగి ఘర్షణకు దారి తీయడంతో ఇరువర్గాలపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ మారుతిశంకర్ సోమవారం తెలిపారు. పారుమంచాల గ్రామానికి చెందిన మల్లెపోగు ప్రసాదు ఎద్దులబండిని తోలుకొని పొలానికి వెళ్తుండగా అదే దారిలో గుండెపోగు ఇమ్మానియేల్ ట్రాక్టర్‌తో పొలానికి వెళ్తున్నాడు. ఎద్దుల బండిని క్రాస్ చేసి వెళ్లే సమయంలో దారి ఇవ్వలేదని ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకొన్న ఇరువురి కుటుంబాల సభ్యులు ఇళ్ల వద్ద ఘర్షణకు పాల్పడటంతో తలలకు దెబ్బలు తగిలాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

6న గృహప్రవేశాలకు చర్యలు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య

నందికొట్కూరు: ఈ నెల 6న తేదీన నందికొట్కూరు జగనన్న లేఅవుట్‌లోని 195 గృహాలకు గృహ ప్రవేశాలు జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం పట్టణ సమీపంలోని జగనన్న లేఅవుట్-1 కాలనీలో జరుగుతున్న పనులను పీడీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నందికొట్కూరు జగనన్న లేఅవుట్‌ను మోడల్ కాలనీగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించిందన్నారు. కాలనీలో గృహనిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆయా శాఖల అధికారులు లబ్ధిదారులకు సహకరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచితంగా ఇస్తున్నామన్నారు. హౌసింగ్ డీఈ శ్రీనివాసులు, ఏఈ అరుణకుమార్, మున్సిపల్ టీపీఓ బాలమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 7వ తేదీలోగా iti. ap. gov. in వెబ్‌సైట్‌లో సమర్పించాలని తెలిపారు. 2 సంవత్సరముల కోర్సులు ఫిట్టర్, టర్నర్, 1 సంవత్సరం కోర్సు వెల్డర్ ట్రేడ్‌లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 10వ తరగతి పాసైన వారు అర్హులని, వెల్డర్ ట్రేడ్‌కు 10వ తరగతి ఫెయిల్ అయిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అనంతరం ఈనెల 8వ తేదీలోగా సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకొని, 9వ తేదీ ఉదయం గం .10:00 లకు శ్రీశైలం ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

బలిజ సత్రం కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం



వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని తెలగ కాపు బలిజ నిత్యాన్న దాన సత్రం కమిటీ సభ్యులుగా చలువాది వేణుగోపాల్ ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం శ్రీశైలంలోని కాపు బలిజ సత్రంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వేణుగోపాల్‌ను పలువురు శ్రేయోభిలాషులు, మిత్రులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు.

పార్టీని మరింత బలోపేతం చేస్తాం



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని సన్మానిస్తున్న వెలుగోడు, మహానంది, బండిఆత్మకూరు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు

వెలుగోడు: క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు పనిచేస్తామని పార్టీ మండలాధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మరో సారి మండల అధ్యక్ష పదవి లభించడం పట్ల సోమవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు మహానంది, బండిఆత్మకూరు పార్టీ మండల అధ్యక్షులు కొమ్మా మహేశ్వర్‌రెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, మండల కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, ఆయా మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాకపోకల నిలిపివేతపై భక్తుల ఆగ్రహం

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో రాత్రి వేళల్లో రాకపోకలను నిలిపివేయడంతో ప్రయాణికులు, భక్తులు సోమవారం రాత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజులపల్లె టోల్ గేటు వద్ద రోడ్డుకు కుర్చీలు అడ్డుగా పెట్టడంతో భక్తులు స్థానిక యువకులపై అసహనం వ్యక్తం చేశారు. రాకపోకలకు నిలిపివేస్తే పోలీసులు ఉండాలికదా, మీరెందుకున్నారని నిలదీశారు. ఇదిలా ఉండగా రాకపోకలు య థావిధిగా కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలో దేవస్థాన వైద్యశాలలో వివేకానంద యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు ప్రారంభించారు. మొత్తం 83 మంది రక్తదానం చేశారు.

ఎక్కడున్నా ఠంఛన్‌గా పింఛన్

- కర్నూలు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ల అందజేత
- లబ్ధిదారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- పింఛన్ల పంపిణీలో మొదటి స్థానంలో జూపాడుబంగ్లా మండలం



కర్నూలు ఆసుపత్రిలో మౌలాలికి నగదు అందిస్తున్న గ్రామ వలంటీర్ బాలాజీ



పెద్దాసుపత్రిలో మల్లెపోగు నారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు కె.లలితమ్మ

పాములపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన గ్రామ వంటీర్ వ్యవస్థ వల్ల ఎక్కడున్నా పింఛన్ లబ్ధిదారులకు చెంతికి చేరుతుండటంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. సోమవారం జూటూరు గ్రామానికి చెందిన మౌలాలి అనే వృద్ధుడు అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ప్రస్తుతం చికిత్సలు పొందుతున్నాడు. గ్రామంలో ఆ పరిధిలోని వలంటీర్ బాలాజీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాయిని మద్దిలేటితో కలిసి వెళ్లి పింఛన్‌సొమ్ము అందజేశాడు. అనారోగ్యంతో కర్నూలులో ఉన్న తనకు ఈ సమయంలో నగదు అందడం చాలా ఆనందంగాఉందని, ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుందని మౌలాలి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

పెద్దాసుపత్రికి వెళ్లి..

జూపాడుబంగ్లా: కర్నూల్లోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్లి జూపాడుబంగ్లాకు చెందిన వలంటీర్లు అక్కడ చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు సోమవారం పింఛన్లు అందజేసి వారి మన్ననలు పొందారు. మండలకేంద్రమైన జూపాడుబంగ్లా గ్రామసచివాలయం-1 పరిధిలోని వలంటీర్లు కె.లలితమ్మ, రోఖియాబీ వారి పరిధిలో ఉన్న మల్లెపోగు నారాయణ, విల్సన్‌ప్రసాద్, ముర్తుజాబీలు క్యాన్సర్, వెన్నముక సమస్యలతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలుసుకొన్న వలంటీర్లు ఆసుపత్రికి వెళ్లి వారితో వేలిముద్రలు వేయించుకొని పింఛన్ మొత్తాన్ని అందజేయటంతో వారు ఆనందంతో వలంటీర్లను ప్రశంసించారు.

జిల్లాలో మొదటి స్థానంలో జూపాడుబంగ్లా

పింఛన్ల పంపిణీలో రెండో రోజైన సోమవారం జూపాడుబంగ్లా మండలం జిల్లాలో రెండో స్థానంలో నిలిచినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 5,133 పింఛన్లు మంజూరు కాగా సాయంత్రం 5గంటల సమయానికి 4,854 పింఛన్లను వలంటీర్లు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కేవలం 279 పింఛన్లు మాత్రమే పంపిణీ చేయాల్సి ఉందన్నారు. రెండో రోజు 94.56 శాతం పింఛన్ల పంపిణీ పూర్తికావడంతో జిల్లాలో మొదటిస్థానం దక్కిందన్నారు.

92.48 శాతం పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాలలో అక్టోబర్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ఆదివారం ప్రారంభం అయ్యింది. ఈ పింఛన్ పంపిణీ కార్యక్రమం సోమవారంతో 92.48 శాతం పూర్తయింది. మండలంలో మొత్తం 4,346 మంది లబ్ధిదారులు ఉండగా గ్రామవలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో 4019 మందికి పింఛన్ కానుకను అందజేసారు. ఇంకా 327 మంది వివిధ కారణాలతో పింఛన్ మొత్తాన్ని అందుకోలేక పోయినట్లు అధికారులు వెల్లడించారు.

మహానంది: మండలంలోని అబ్బీపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు నంద్యాలలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వలంటీర్ గుణవర్ధన్ ఆస్పత్రికి వెళ్లి నగదు అందించాడు. అలాగే బొల్లవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు గంగమ్మకు వలంటీరు అరుణ పింఛను డబ్బును అందించారు. గాజులపల్లె చెందిన డప్పు కళాకారుడు అనారోగ్యంతో బాధపడుతూ నంద్యాలలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్లు రవికృష్ణ, వెంకట నరసింహులు వెళ్లి పింఛన్ అందించారు.



ఆస్పత్రిలో ఉన్న గంగమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ అరుణ



క్యాన్సర్‌తో కర్నూలులో చికిత్సపొందుతున్న ముర్తుజాబీ కుటుంబీకులకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీరు రోఖియాబీ



దుద్యాలలో సత్తార్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జాకీర్